పాలమూరుకు.. మొండిచేయి



పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఎల్లూరు వద్ద నిర్మించిన పంప్‌హౌస్

- కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు నిధులు ఇవ్వని మోదీ ప్రభుత్వం
- కొత్త జిల్లాలకు నవోదయ, కేంద్రీయ విద్యాలయాల ప్రస్తావన కరువు
- భూ ఆధార్, డిజిటలైజేషన్ ప్రతిపాదనతో వివాదాలకు బ్రేక్ పడే అవకాశం
- నూనె గింజల సాగుకు ప్రోత్సాహం.. ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట
- రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ ఆధారంగానే పెండింగ్ ప్రాజెక్టుల పనులు ముందుకు

మహబూబ్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మోదీ 3.0 ప్రభుత్వంలో తొలిసారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈసారి ఎక్కువ పార్లమెంట్ స్థానాలను ఇచ్చిన తెలంగాణకు అదే స్థాయిలో కేటాయింపులు ఉంటాయని భావించగా, హంసపాదు ఎదురైంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో అనేక సాగునీటి ప్రాజెక్టులు, బెంగళూరు- హైదరాబాద్ జాతీయ రహదారి విస్తరణ పనులకు నిధులు కేటాయిస్తారని అనుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పలుమార్లు కేంద్ర ప్రభుత్వంలోని మంత్రులను కలిసి, వినతిపత్రాలు సమర్పించింది. అందుకు ప్రధాన మంత్రి నుంచి.. కేంద్రమంత్రులందరూ సానుకూలంగా స్పందించారని భావించిన వేళ.. మంగళవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను తీవ్రంగా నిరాశపరిచిందని చెప్పొచ్చు. ఈ బడ్జెట్‌లో తెలంగాణకు సంబంధించిన ఏ ఒక్క విన్నపానికి ఆమోద ముద్ర లభించలేదు. దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న విధానాలు తప్ప.. కొత్త పనుల విషయంలో మొండిచేయి చూపారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో కొత్త జిల్లాలు ఏర్పాటైన తర్వాత నుంచి ఇప్పటివరకు నూతన నవోదయ పాఠశాలలు, జిల్లాకో కేంద్రీయ విద్యాలయం, నారాయణపేటలో సైనిక్ పాఠశాల, కొత్తగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఉండగా, వాటిపై ప్రస్తావన కరువైంది. కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు వస్తే ప్రాధాన్య క్రమంలో ఇచ్చిన హామీలను నెరవేర్చ వచ్చనే అభిప్రాయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉండగా.. అసలు వాటి ప్రస్తావనే కరువైంది. దాంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్ పైనే ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు పనులు ఆధారపడ్డాయి. ఎన్నికల సమయంలో బీజేపీ నాయకులు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ బడ్జెట్‌లో లేకపోవడం గమనార్హం.

పాలమూరు ఎలా..

ఉమ్మడి పాలమూరుతో పాటు నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాలకు సాగు నీరు, 1,226 గ్రామాలకు తాగు నీరు అందించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును చేపట్టింది. దీనికి జాతీయ హోదా ఇస్తామని మోదీ ప్రధాని కాక ముందు హామీ ఇచ్చారు. అయితే తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును రీడిజైన్ చేసింది. జాతీయ హోదా అంశం పక్కన పెడితే.. ఇప్పటివరకు వివిధ కార్పొరేషన్ల నుంచి రుణాలు తెచ్చారు. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.55,086 కోట్లు కాగా.. రూ.31,424.49 కోట్ల మేర పనులు జరిగాయి. రూ.1,915 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే పార్లమెంట్ ఎన్నికల సమయంలో కేంద్రం నుంచి ఈ ప్రాజెక్టుకు నిధులు తెస్తామని బీజేపీ నాయకులు హామీ ఇచ్చారు. దాంతో ప్రాజెక్టుకు బడ్జెట్‌లో అత్యధిక కేటాయింపులు ఉంటాయని భావించగా, నిరాశే ఎదురైంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో భాగంగా పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించిన కేంద్రం.. దానికి నిధులపై ప్రస్తావించింది. కాగా.. మోదీ స్వయంగా హామీ ఇచ్చిన పాలమూరు ప్రాజెక్టుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయకపోవడం దారుణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. కేంద్రం బడ్జెట్ కేటాయింపులను అనుసరించి.. రెండేళ్లలో పూర్తిచేసే ప్రాజెక్టులకు నిధులతో పాటు, పీఆర్‌ఎల్‌ఐకి రూ.2,500 కోట్లు కేటాయించొచ్చని భావించగా ఇప్పుడు ఎలా అని సందిగ్ధం మొదలైంది. అలాగే ఈసారి బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని భావించిన హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి విస్తరణ పనులకు కూడా మోక్షం లభించలేదు.

పలు విధాన నిర్ణయాలిలా..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పలు విధాన నిర్ణయాలను ప్రతిపాదించింది. ముఖ్యంగా పప్పు ధాన్యాలు, నూనె గింజల సాగులో స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేస్తామని ప్రకటించింది. దాంతో నారాయణపేట జిల్లాలో కందులు, జోగుళాంబ గద్వాల జిల్లాలో పప్పు శనగ, వనపర్తి జిల్లాలో వేరుశనగ సాగును ప్రోత్సహించే అవకాశం ఉంది. ఆయిల్ పామ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించగా.. ఉమ్మడి జిల్లాలో వేలాది ఎకరాల్లో ఈ సాగును రైతులు చేపట్టారు. ప్రస్తుతం మొదట సాగుచేసిన తోటల్లో గెలల కటింగ్ కూడా జరుగుతోంది. అయితే ఇప్పటి వరకు క్రషింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఎలాంటి ఆచరణాత్మక ప్రక్రియ ప్రారంభం కాలేదు. కేంద్ర నూతన విధానంతో క్రషింగ్ యూనిట్లు నెలకొల్పే అవకాశం ఉంది. దీంతోపాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలో కూరగాయల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉండగా, దేశవ్యాప్తంగా డిమాండ్ ఉన్న నగరాలు, పట్టణాలకు సమీపంలో భారీ కూరగాయల క్లస్టర్లను ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించింది. దీనివల్ల ఉమ్మడి జిల్లాలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి కూరగాయల దిగుమతిపై ఆధారపడటం తగ్గే అవకాశం ఉంది. అలాగే ఇప్పటికే ఉమ్మడి పాలమూరులో ప్రకృతి వ్యవసాయం వైపు పలువురు యువత ప్రయత్నిస్తుండగా.. వారికి కేంద్రం రాయితీలు, బ్రాండింగ్, సర్టిఫికేషన్ స్థానికంగానే కల్పిస్తామని బడ్జెట్‌లో ప్రకటించింది. వేరుశనగ, పప్పుశనగ, కంది పంటల సాగులో ఇప్పటికీ సంప్రదాయ వంగడాలపై రైతులు ఆధారపడగా.. 109 కొత్త వంగడాలను విడుదల చేస్తామని ప్రకటించడం ఉపయోగకరంగా ఉండనుంది. భూ విలువ పెరుగుదలతో వ్యవసాయం, పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయేతర భూముల వివాదాలు భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలో తాజా బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత భూములకు భూ- ఆధార్, పట్టణ భూ రికార్డుల డిజిటైజేషన్‌ను ప్రతిపాదించింది. వివాదాల తగ్గుదలకు ఈ ప్రతిపాదన అనుకూలించవచ్చు. ఇవి కాకుండా ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఐదేళ్లకుగాను రూ.2.2 లక్షల కోట్ల నిధులు కేటాయించగా.. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అన్వయించుకునే అవకాశం ఏర్పడనుంది.

యువ రైతులకు ప్రోత్సాహం కల్పించేలా ఉంది



మూడవ సారి ప్రధాన మంత్రిగా ఎన్నికైన నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయంలో డిజిటలై జేషన్ చేయడం వల్ల ప్రత్యేక బడ్జెట్ ద్వారా యువ రైతుకలు ప్రోత్సాహం, నూతన ఒరవడి పెరుగుతుంది. 15లక్షల పైన సంవత్సర ఆదాయం పొందుతున్న ఉద్యోగులకు 17వేల 500వరకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆదా అయ్యే అవకాశం ఉంటుంది.

- రామారాజుయాదవ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొల్లాపూర్

ఆశలు అడియాసలు : మంత్రి జూపల్లి

హైదరాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో మంగళవారం కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన బడ్జెట్ పూర్తిగా నిరాశాజనకంగా ఉందని, తెలంగాణకు మొండి చేయి చూపారని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటకం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. విభజన హామీలు, హక్కుగా రావాల్సిన నిధుల గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల అభివృద్ధి, సంక్షేమంపై ఎలాంటి భరోసా ఇవ్వలేదని విమర్శించారు. ఎన్డీయే భాగస్వాములైన ఏపీ, బీహార్‌తో పాటు అస్సాంకు ప్రాధాన్యం కనిపించిందన్నారు. రాష్ట్ర ప్రజలు నిరీక్షిస్తున్న బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ ఊసే లేదన్నారు. ఇక పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించి నిధులు కేటాయిస్తారని ఆశించిన ప్రజల ఆశలు అడియాసలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తెలంగాణకు జరిగిన అన్యాయంపై కేంద్రాన్ని ప్రశ్నించాలని కోరారు.

అన్ని వర్గాలకు సంక్షేమం: ఎంపీ డీకే అరుణ

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశాభివృద్ధి, అన్ని వర్గాలకు సంక్షేమం చేకూర్చేలా ఉంది. తొమ్మిది ప్రధాన అంశాల ఆధారంగా బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. మహిళలు, యువత, రైతులు, పేద, మధ్య తరగతి వర్గాల సంక్షేమంతో పాటు విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనకు పెద్దపీట వేశారు. బడ్జెట్‌పై సీఎం రేవంత్, కేటీఆర్ వ్యాఖ్యలు సరికావు. రాజకీయ రాద్ధాంతం కోసమే ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. పాలమూరు రంగారెడ్డి నిర్మాణం కోసం ఇదివరకే 60 శాతం నిధులు ఇస్తామని మాటిచ్చిన సంగతి మరిచిపోయారా? హైదరాబాద్ నుంచి బెంగళూరు వరకు ఇండస్ట్రియల్ కారిడార్‌లో తెలంగాణ 210 కిలో మీటర్లు ఉందని, అది భాగం కాదా? అని అన్నారు. చక్కటి బడ్జెట్ రూపొందించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

తీరని ధరణి తిప్పలు

- ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు
- జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం దరఖాస్తులు 38,557
- పరిష్కరించినవి 24,383.. తిరస్కరణకు గురైనవి 11,492
- పునఃపరిశీలించాలంటున్న రైతులు



భూ సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతు(ఫైల్)

గద్వాల న్యూటౌన్, జూలై 23: జోగుళాంబ గద్వాల జిల్లాలో ఏళ్ల ధరణి సమస్యలు పరిష్కారం కావడం లేదు. ప్రతీ సోమవారం ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల్లో భూ సమస్యలే ఎక్కువగా ఉంటున్నాయి. జిల్లాలో 2020 నుంచి గత సోమవారం సాయంత్రం వరకు ధరణికి సంబంధించి 38,557 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అధికారులు 24,383 దరఖాస్తులను పరిష్కరించగా.. 2,682 పెండింగ్‌లో ఉన్నాయి. కాగా 11,492 తిరస్కరణకు గురయ్యాయి. దాంతో సమస్య మళ్లీ మొదటి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరణి సమస్యలపై దృష్టి పెట్టి, వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో అధికారులు ఆ పనిలో ఉన్నారు. అయితే తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించి కారణాలను అధికారులు చెప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటికి గల కారణాలను తెలిపి, పునఃపరిశీలన చేయాలని కోరుతున్నారు.

తహసీల్దార్లకు లాగిన్‌తో సులభం

ధరణి లాగిన్ గతంలో కలెక్టర్లకు మాత్రమే ఉండటంతో సమస్యలు తొందరగా పరిష్కారం అయ్యేవి కావు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లకు కూడా లాగిన్ సౌకర్యం కల్పించింది. దాంతో తహసీల్దార్ లాగిన్‌లో ఆధార్‌కార్డు, పేరు, కులం, స్త్రీ, పురుష, తండ్రి పేరు వంటి తప్పుల సవరణ, వారసత్వం, ఖాతా నంబర్, విలీనం వంటి సమస్యలు మాత్రమే పరిష్కరించే అవకాశం ఉంది. పాసు పుస్తకం లేకుండా నాలా కన్వర్షన్, భూ సేకరణలో వచ్చే సమస్యలు, మిస్సింగ్ సర్వే నంబర్లతో పాటు మరికొన్ని ఆర్డీవో పరిధిలో పరిష్కరిస్తారు. తర్వాత పెండింగ్ మ్యుటేషన్, పాసు పుస్తకాలు లేని అసైన్డ్ భూములు, వారసత్వం మార్పు, పట్టాదారు పాసు పుస్తకాలు జారీ, కోర్టు కేసులు తదితర మొత్తం సమస్యల పరిష్కారం కలెక్టర్ లాగిన్‌కు ఉంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు త్వరగా పరిష్కరించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

త్వరితగతిన పరిష్కరిస్తాం

ధరణి పెండింగ్ ఫిర్యాదులను పరిశీలించి, త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నాం. వాటిలో ఉన్న అంశాలను బట్టి క్లియర్ చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు సమస్యలన్నీ త్వరలో పరిష్కరించేలా ముందుకెళ్తున్నాం.

- వీరభద్రప్ప, ధరణి ఇన్‌చార్జి పర్యవేక్షకులు



మోనప్ప గుట్టలో బోనాలతో మహిళలు



శివశక్తినగర్‌లో అమ్మవారికి సాక పోస్తున్న భక్తులు

ఘనంగా బోనాలు

మహబూబ్‌నగర్ పట్టణంలో మంగళవారం బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో పోచమ్మకు భక్తులు బోనమెత్తారు. కల్లు, నాటు కోళ్లతో నైవేద్యం సమర్పించారు. ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి, మొక్కులు చెల్లించారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్



బోనంతో మహిళ

మోనప్ప గుట్టలో నృత్యం చేస్తున్న మహిళలు

అప్పన్నపల్లిలో..



బుజ్జి సందడి

- పాలమూరులో కల్కి సినిమా కారు ప్రదర్శన



కల్కి సినిమాలో వాడిన ప్రత్యేకమైన కారులోంచి దిగుతూ అభివాదం చేస్తున్న సినిమా డైరెక్టర్ నాగ్ అశ్విన్




కారు వద్ద ఫొటోలు దిగుతున్న యువతులు


మహబూబ్‌నగర్/పాలమూరు, జూలై 23: కల్కి 2898 ఏడీ సినిమాలో హీరో ప్రభాస్ ఉపయోగించిన ప్రత్యేకమైన కారు బుజ్జి మంగళవారం పాలమూరులో సందడి చేసింది. సినిమా విజయోత్సవంలో భాగంగా ఆ కారుతో పాటు సినిమా డైరెక్టర్ నాగ్ అశ్విన్ పాలమూరులోని ఏవీడీ సినిమా థియేటర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా నాగ్ అశ్విన్‌కు అభిమానులు, సినిమా థియేటర్ యాజమాన్యం పూలు, కరతాళ ధ్వనులమధ్య స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌కు రావడంతో సొంత ఇంటికి వచ్చినట్లు ఉందని అన్నారు. సినిమాలో ముఖ్య పాత్ర పోషించిన బుజ్జి కారును ఇక్కడికి తెచ్చి, అభిమానులకు కనువిందు చేస్తున్నట్లు తెలిపారు. కల్కి సినిమా కోసం డైరెక్టర్ నాగ్ అశ్విన్ ప్రత్యేకంగా తయారు చేయించిన బుజ్జి కారును అభిమానులు తిలకించేందుకు బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ప్రదర్శనకు ఉంచారు. కారును తాకకుండా ఉండేందుకు చుట్టూ బారికేడింగ్‌ను ఏర్పాటు చేయించారు. బుజ్జి పాలమూరుకు చేరుకున్న విషయం తెలుసుకున్న అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో మైదానానికి చేరుకున్నారు. కారును ఫొటోలు తీస్తూ, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. కల్కి సినిమాలో నటించిన వైజయంతి మూవీస్ యూనిట్ సభ్యులు రమేశ్ మాట్లాడుతూ కల్కి సినిమా కోసమే ఈ బుజ్జి కారును మహీంద్రా కంపెనీతో తయారు చేయించినట్లు చెప్పారు. కల్కి 2లోనూ ఈ కారును ఉపయోగించనున్నట్లు తెలిపారు. ఈ కారు ధర రూ.ఏడు కోట్లు అని, దీని బరువు 6.5 టన్నులు అని, ఒకసారి చార్జింగ్ చేస్తే 40 కిలో మీటర్లు వెళ్తుందని చెప్పారు. కారు వెడల్పు 12 ఫీట్లు కాగా, పొడవు 19 ఫీట్లు ఉంటుందన్నారు. చాలా సినిమాల్లో ఇలాంటి వాహనాలను గ్రాఫిక్స్‌లో చూయిస్తున్నారని, కానీ ఇందులో మాత్రం రియల్ వెహికిల్ ఉండాలని డైరెక్టర్ పట్టుబట్టి తయారు చేయించారని వివరించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ సినిమా డైరెక్టర్ నాగ్ అశ్విన్ సొంత జిల్లా(నాగర్‌కర్నూల్) కావడంతోపాటు బుజ్జి కారును మహబూబ్‌నగర్‌కు తేవాలని అభిమానులు కోరినందున ఇక్కడికి తెచ్చామన్నారు. హీరో ప్రభాస్‌కు బుజ్జి బాగా కనెక్ట్ అయ్యిందని, ఆయన చెప్పినట్లుగా పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టాకీసు యాజమాన్యం శివ కుమార్, శ్రీధర్‌రెడ్డి, ప్రభాస్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు రాజు, అభిమానులు పాల్గొన్నారు.

నీట మునిగిన గర్భగుడి

- సంగమేశ్వర ఆలయం చుట్టూ చేరిన వరద నీరు



ఆలయం చుట్టూ చేరిన వరద నీరు



గర్భగుడిలో చివరి సారి పూజలు చేస్తున్న పూజారి రఘురామయ్య శర్మ

కొల్లాపూర్, జూలై 23: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిలలోని పురాతన సంగమేశ్వర ఆలయం గర్భగుడి పూర్తిగా జలాధివాసమైంది. మంగళవారం తెల్లవారుజాము నుంచే గర్భగుడిలోకి వరద నీటి రాక మొదలైంది. సాయంత్రంలోగా పూర్తిగా మునిగిపోయింది. ఎగువ ప్రాంతాల్లో వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు జూరాల ప్రాజెక్టు నుంచి శ్రీశైలానికి వరద ఉధృతంగా వస్తోంది. ముందుగా సంగమేశ్వర ఆలయం చుట్టూ చేరిన నీరు ఆ తర్వాత గర్భగుడిలోకి చేరాయి. అక్కడ ఉన్న వేపదారు లింగాన్ని ముంచేశాయి. చివరి రోజు గర్భగుడిలో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామయ్య శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ప్రాంగణంలోకి వరద జలాలు చేరాయి. మరో నాలుగు రోజుల్లో ఆలయం పూర్తిగా జలాధివాసం కానుందని పూజారి చెప్పారు. దాంతో ఆరు నెలల పాటు భక్తులకు సంగమేశ్వరుడి దర్శనం ఉండదని తెలిపారు. స్వామిని చివరిసారి తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల భక్తులు ఆసక్తి చూపించారు.

28న కల్వకుర్తికి సీఎం

- కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి విగ్రహం ఆవిష్కరణ
- రూ.30 లక్షలతో కాంస్య విగ్రహం ఏర్పాటు

కల్వకుర్తి, జూలై 23: కేంద్ర మాజీ మంత్రి, దివంగత సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 28న కల్వకుర్తి పట్టణానికి రానున్నారు. జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కొట్ర గేటు వద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు కాయితీ సాయిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షానవాజ్‌ఖాన్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా పనులను పర్యవేక్షించారు. జైపాల్‌రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. విగ్రహ ఏర్పాటు పనులను జైపాల్‌రెడ్డి తమ్ముడు మనోహర్‌రెడ్డి పరిశీలించారు.



మద్దిగట్లలో గొర్రెల మందపై అడవి జంతువు దాడి


భూత్పూర్, జూలై 23 : మండలంలో గొర్రెలు, లేగదూడలపై అడవి జంతువుల దాడులు అధికమయ్యాయి. మొన్నటి వరకు వెల్కిచర్ల గ్రామంలో రోజుకో చోట పశువులు, లేగ దూడలపై గుర్తు తెలియని అడవి జంతువులు దాడి చేసి, చంపి తినడంతో రైతులు ఆందోళన చెందగా, ఇప్పుడు మద్దిగట్లలో గొర్రెల మందపై అడవి జంతువులు దాడి చేసిన సంఘటన ఇది. సోమవారం అర్ధరాత్రి మద్దిగట్ల గ్రామానికి చెందిన జక్క సిగ్గయ్య, బండమీది మల్లేష్, పాలమూరు మల్లేష్‌లకు గొర్రెలు ఉన్నాయి. వీళ్ల తమ గొర్రెలను రోజువారిగా మేత మేపుకొని గ్రామ శివారులో ఉన్న శేరికుంట అలుగు వద్ద మందను ఆపుకున్నారు. సోమవారం రాత్రి సిగ్గయ్య, మల్లేష్ మరి కొంత మంది భోజనం చేయడానికి మద్దిగట్లకు వచ్చి, రాత్రి 9:30 గంటలకు తిరిగి మంద్ద వద్దకు వెళ్లారు. ఇంతలోనే మంద మీదకు గుర్తు తెలియని అడవి జంతువు దాడి చేసి ఒక గొర్రె మెడను పట్టుకొని తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో మేలుకున్న కాపరులు కేకలు వేశారు. దీంతో అది పారిపోయింది. మందలో ఒక గొర్రెను గాయపర్చగా కాసేపటి తర్వాత అది చనిపోయింది. గ్రామస్థులు మంగళవారం గొర్రెల మందను పరిశీలించి, కాపరులకు ధైర్యం చెప్పారు. రోజురోజుకు మూగజీవాలపైన గుర్తు తెలియని అడవి జంతువు దాడి చేసి లేగ దూడలను, గొర్రెలను చంపుకొని తినడంతో మద్దిగట్ల, వెల్కిచర్ల గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.













ఔషధ మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

- ఓయూ ప్రొఫెసర్ శైలజ - వృక్షశాస్త్ర విభాగంలో ఒక రోజు వర్క్‌షాప్



జ్యోతిని వెలిగించి వన్‌డే వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, జూలై 23 : ఔషధ మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని వృక్షశాస్త్ర విభాగం ఓయూ ప్రొఫెసర్ కె.శైలజ అన్నారు. మంగళవారం అకాడమిక్ బ్లాక్‌లో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన వృక్షశాస్త్ర విభాగం ఓయూ ప్రొఫెసర్ కె.శైలజ మాట్లాడుతూ ప్రతీ మొక్కలో ఔషధ గుణాలు ఉన్నాయని, రణపాల ఆకును దగ్గు నయం కోసం వాడతారని అన్నారు. ఔషధ మొక్కలలో ఆల్కలాయిడ్స్ ఉంటాయని, వేప, కానుగ, జామ చెట్లలో కూడా ఔషధ గుణాలు కలిగి ఉన్నాయని అన్నారు. ఔషధ మొక్కలలో సంగ్రహణ ద్వారా వివిధ రసాయన పదార్థాలను వేరు పరిచి అవి ఏవిధంగా ఔషధ గుణాలను కల్గి ఉన్నాయనే విషయాలను వృక్షశాస్త్ర విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. హిమాలయాలలో ఔషధ మొక్కలు విరివిగా లభిస్తాయని, సర్వరోగ నివారణకు మొక్కలు ఉపయోగపడతాయని అన్నారు. అందరించిపోతున్న ఔషధ మొక్కలను సంరక్షించి భవిష్యత్ తరాలకు విత్తన బ్యాంకు ద్వారా అందించాలని తెలిపారు. అంతకు ముందు ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ డి. మధుసూ దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాచీన కాలంలో మన పూర్వీకులు ఏదైన జబ్బుకు గురైతే ఆకు పసరు మందు పోసి నయం చేసే వారని అన్నారు. అనంతరం వర్క్ షాప్‌కు హాజరైన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రకిరణ్, కన్వీనర్ పుష్పలత, వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బృందాదేవి, డాక్టర్ శివకుమార్ సింగ్, డాక్టర్ రాణెమ్మ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలకు వీసీలను నియమించాలి

- పీయూ ఏబీవీపీ నాయకులు

పాలమూరు యూనివర్సిటీ, జూలై 23 : రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు వీసీలను నియమించాలని, పాలమూరు యూనివర్సిటీలోని నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీయూ ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పీయూలో పార్మసీ కళాశాల నుంచి ప్రధాన గేటు వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పీయూ కమిటీ అధ్యక్షుడు కృష్ణ కుమార్ మాట్లాడుతూ నీళ్లు, నిధులు నియామకాలు అనే నినాదంతో ఏర్పడ్డ తెలంగాణలో ఇప్పటి వరకు అవి ఏవీ నెరవేరలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు వెంటనే నోటి ఫికేషన్ విడుదల చేయాలని, భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధికి అధిక నిధులు విడుదల చేయాలని కోరారు. యూనివర్సిటీలో పని చేస్తున్న అధ్యాపకులను, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, నాన్ టీచింగ్ ఉద్యోగులను కాంట్రాక్ పద్ధతిలోకి మార్చాలని కోరారు. సంఘం నాయకులు జైపాల్, శివ, వేణుగోపాల్, శ్రీను, నగేష్, శ్రీనివాసులు, ఆదిత్య, సాయి, వేణు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.





దారులు దరిద్రం

- కనీసం మరమ్మతులు లేక నరకాన్ని తలపిస్తున్న రహదారులు
- ద్విచక్ర వాహనదారులకు నిత్య ప్రమాదాలు
- ఆటోలు, కార్లకు తప్పని ఇబ్బంది
- తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని రహదారులు, భవనాల శాఖ అధికారులు

రోడ్లు.. నరకానికి నకళ్లుగా మారాయి. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా రహదారులు అధ్వానంగా తయారై ప్రయాణికుల పాలిట యమ దూతలుగా మారాయి. ఎటు చూసినా గుంతలు.. రాళ్లరప్పలతో నిండుకుని ప్రయాణం చేసేందుకు ప్రమాదకరంగా తయారయ్యాయి.



గుంతలమయంగా మారిన ఉప్పునుంతల నుంచి మొల్గర వెళ్లే బీటీ రోడ్డు

ఆంధ్రజ్యోతి పరిశీలన

నాగర్‌కర్నూల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లోని రహదారులు నరకాన్ని తలపిస్తున్నాయి. సుదీర్ఘకాలంగా మెయింటనెన్స్ లేకపోవడంతో రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. గుంతలమయంగా మారిన రోడ్లపై ప్రయాణించాలంటేనే జనం జంబెలెత్తుతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్ల సంగతి దేవుడెరుగు కనీసం కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. మరమ్మతుల పేరిట మంజూరవుతున్న నిధులు ఏమవుతున్నాయో అంతుపట్టడం లేదు. పంచాయతీ రాజ్, రోడ్డు భవనాల శాఖ పరిధిలోకి వచ్చే రహదారుల వైపు అధికార యంత్రాంగం కన్నెత్తి కూడా చూడడం లేదు. అసలే వానాకాలం కావడంతో కాలు తీసి కాలు పెట్టలేని పరిస్థితులు జనం అల్లాడుతున్నారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజక వర్గాల్లో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి కన్పిస్తోంది. కొల్లాపూర్ నుంచి 8కిలో మీటర్ల దూరంలో ఉన్న అమరగిరి వద్ద కృష్ణానది సోయగాలను ప్రకృతి అందాలను సందర్శించడానికి వారాంతాల్లో రాష్ట్ర నలుమూలల నుంచి సందర్శకులు పెద్ద ఎత్తున తరలి వస్తుంటారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నల్లమట్టిని తరలించే భారీ వాహనాలు ఇక్కడి నుంచి రాకపోకలు కొనసాగిస్తుండడంతో రహదారి బాగా దెబ్బతింది. దీంతో పర్యాటకులకు అవస్థలు ఏర్పడుతున్నాయి. అచ్చంపేట పట్టణంలోని పలు కాలనీల్లో రోడ్డు రాకపోకలకు ఏమాత్రం అనుకూలంగా లేదు. వర్షాలకు వంగూరు, ఉల్లంపల్లి రోడ్డు బురదమయంగా మారింది. అమ్రాబాద్ మండల కేంద్రంలో రోడ్డుపై వర్షపు నీరు చేరి రాకపోకలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. రోడ్డుపై నీరు చేరడంతో దోమలు, ఈగల బాధ అధికమైందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చారకొండ మండలంలో జూపల్లి నుంచి వంగూరు వెళ్లే మట్టి రోడ్డు పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉంది. ఉప్పునుంతల నుంచి మొల్గర వెళ్లే బీటీ రోడ్డు పరిస్థితి కూడా దరిద్రంగా తయారైంది. వెల్దండ నుంచి రాచూరుకు వెళ్లే రహదారి కాలు తీసి కాలు పెట్టలేనంతా చండాలంగా మారింది. తెలకపల్లి నుంచి గట్టునెల్లికుదురు వెళ్లే దారి బురదమయంగా మారడంతో మోటారు సైకిళ్లపై వెళ్లేవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కల్వకుర్తి నుంచి కుర్మిద్దకు వెళ్లే రహదారి పరిస్థితి కూడా దారుణంగా తయారైంది. ఊర్కొండ మండలం రాచాలపల్లి, మాదారం రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ దాడి గుండా ప్రయాణించాలంటేనే జంకాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ నుంచి తీర్నాంపల్లికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో పాదచారులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డును బీటీగా మార్చాలని ఏళ్ల తరబడిగా జనం కోరుతున్నా పట్టించుకునే పాపాన పోవడం లేదు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మేలుకొని కష్టాల నుంచి తమను గట్టెక్కించాలని జనం కోరుకుంటున్నారు.



కొల్లాపూర్ మండల పరిధిలోని అమరగిరికి వెళ్లే ప్రధాన రహదారి



అచ్చంపేట పట్టణంలో అధ్వానంగా మారిన రహదారి



చిత్తడిగా మారిన రాచాలపల్లి-మాధారం రోడ్డు



గుంతలమయంగా మారిన కల్వకుర్తి నుంచి కుర్మిద్ద వెళ్లే రోడ్డు



గుంతలమయంగా మారిన బిజినేపల్లి పట్టణ ప్రధాన రహదారి

పూరిగుడిసె ధ్వంసం చేసి..

- పామును చంపిన బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు



గుడిసెతో పాటు పుట్టను నేలమట్టం చేసిన బాధిత కుటుంబ సభ్యులు

చారకొండ, జూలై 23: పాముకాటుకు గురై చిన్నారి బాలిక ఏదుల రేణుక(4) మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని తుర్కలపల్లిలో చోటుచేసుకొన్న విషయం తెలిసిందే. పాము పుట్ట ఉన్న గుడిసెను మంగళవారం ధ్వంసం చేసి మరి చంపివేశారు. ఇందుకు సంబంధించి గ్రామస్థుల వివరాల మేరకు... బాలిక తల్లిదండ్రులు ఏదుల సువర్ణ, యాదయ్యలు తన ఇంటిని అనుసరించి ఉన్న పూరి గుడిసెలో పుట్ట ఉండడంతో దాంట్లోని పామే తమ పాపను కాటేసి ఉండొచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. యాదయ్య ఇంటిని అనుసరించి గత కొన్ని ఏళ్లుగా పూరి గుడిసెలో ఓ పుట్ట పెరుగుతూ వస్తున్నది. ఆ గుడిసెలో పాతసామాన్లు పెట్టేవారు. గతంలో ఓ కోడిని, దాని గుడ్లను సైతం పాము తిన్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ క్రమంలో ఇంటి వద్ద ఆడుకుంటున్న చిన్నారి పాప రేణుకను పుట్టలో ఉన్న పామే కాటేసి పొట్టన పెట్టుకుందని భావించిన కుటుంబ సభ్యులు ఎప్పటికైనా పుట్టతో ప్రమాదమని మంగళవారం ఉదయాన్నే ఎక్స్‌కవేటర్ సహాయంతో పూరి గుడిసెను పూర్తిగా ధ్వంసం చేశారు. అందులో ఉన్న పుట్టను తొలగించగా పుట్టలో రెండు పాములు ఉన్నట్లు గుర్తించి వాటిని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు చంపి కాల్చివేశారు. అనంతరం చిన్నారి రేణుక అంత్యక్రియలు కన్నీటి పర్యంతం మధ్య నిర్వహించారు.

పేకాట స్థావరంపై దాడి: నలుగురిపై కేసు

కల్వకుర్తిటౌన్, జూలై 23 : పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మాధవరెడ్డి మంగళవారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణ శివారులో ఓ వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్నారని సమాచారంతో సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి తమ సిబ్బందితో దాడులు నిర్వహించగా పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకున్నామన్నారు. వారి వద్ద రూ.20,220 నగదును, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉరి వేసుకొని చేనేత కార్మికుడి ఆత్మహత్య



పరమేశ్(ఫైల్)

అయిజ, జూలై 23: ఉరివేసుకుని చేనేత కార్మికుడు పరమేశ్(52) ఆత్మ హత్య చేసుకున్నాడు. ఈ ఘటన గద్వాల జిల్లా అయిజ పట్టణంలో మంగళ వారం చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్ భాస్కర్, బాధితకుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి భార్య జ్యోతితో కలిసి భోజనం చేసిన తరువాత ఇంట్లోని హాలులో పరమేశ్ నిద్రించారు. మంగళవారం ఉదయం చూసే సరికి పక్క గదిలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భర్తను విగతజీవిగా చూసి గుండెలు పగిలేలా భార్య రోధించింది. మృతుడి కుమార్తెకు వివాహం అయ్యింది. కుమారుడు హైదరాబాద్‌లో విద్యను అభ్యసిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు పలువురు చర్చించుకున్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ భాస్కర్ తెలిపారు. 1994 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి మిత్రులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియ ఖర్చులకు రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు.

దివ్యాంగుడి ద్విచక్ర వాహనం ధ్వంసం

రాజోలి, జులై 23 : ఇంటి దగ్గర నిలిపిన దివ్యాంగుడి ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి మురుగు కాలువలో పాడేసిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలోని మాన్‌దొడ్డి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు మాదన్న తెలిపిన వివరాలు ప్రకారం.. ఇంటి దగ్గర నిలిపిన ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో గ్రామంలో మొత్తం వెతికితే అచూకీ లభ్యం కాలేదు. గుర్తు తెలియని దుండగులు వాహనాన్ని ఊరు చివరకు తీసుకెళ్లి ధ్వంసం చేసి, మురుగ కాలువలో పాడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

రాజోలి, జులై 23 : బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రం రాజోలిలో బహిరంగ ప్రాంతంలో మద్యం తాగుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. ఆరుగురిని గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోపాల్‌పేట, జూలై 23 : గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న సోడె వెంకటయ్య మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈనెల 18వ తేదీన మండలంలోని మున్ననూర్ గ్రామంలో సోడె వెంకటయ్య తన ఇంట్లో సిలిండర్ లీకవుతోందని మెకానిక్ శంకర్‌ను తీసుకెళ్లాడు. మరమ్మతు చేస్తున్న సమయంలో గ్యాస్ లీకై పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో సిలిండర్ పక్కనే ఉన్న వెంకటయ్యతో పాటు, భార్య మెకానిక్ తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురిలో సోడె వెంకటయ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో మృతి చెందాడు. వెంకటయ్య భార్య చిట్టెమ్మ పరిస్థితి కూడా విషమంగా ఉందని కుటుంబీకులు తెలిపారు.

ప్రసవంలోనే శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ తండ్రి ఫిర్యాదు



ఆసుపత్రి సూపరింటెండెంట్ రంజిత్‌కు ఫిర్యాదు చేస్తున్న తండ్రి రబ్బాని

నారాయణపేట, జూలై 23 : ప్రసవంలోనే శిశువు మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా ఆసుపత్రిలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట జిల్లా కేంద్రంలోని సుభాష్‌రోడ్డు కలాల్‌వాడికి చెందిన సమీరా తబుసుమ్ పురిటి నొప్పులతో మొదటి కాన్పుకోసం భర్త రబ్బానితో కలిసి సోమవారం ఉదయం పది గంటలకు జిల్లా ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి నార్మల్ డెలివరి అవుతుందని అందుకు కాస్త సమయం పడుతుందన్నారు. కాగా పురిటి నొప్పులు అధికం కావడంతో ఇక్కడ పనిచేసే ఓ మేడమ్ ప్రైవేట్ ఆసుపత్రి నుంచి తీసుకొచ్చిన ఇంజక్షన్ ఇచ్చి వాకింగ్ చేయాలని సూచించారు. తీరా రాత్రంతా నొప్పులతో బాధపడగా, మంగళవారం ఉదయం పది గంటల సమయంలో సిజేరియన్ చేయాలని కోరినా వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రసవ గదిలో ఇంజక్షన్ ఇచ్చారన్నారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో బిడ్డ సగం బయటికి రావడంతో ఆలస్యంగా వచ్చిన డాక్టర్ బిడ్డను బయటికి తీశారు. జన్మించిన ఆడ శిశువును చిన్నపిల్లల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవరించిన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆందోళనకు సిద్ధం అవుతుండగా పోలీసుల వచ్చి ఫిర్యాదు చేయాలని కోరగా తండ్రి రబ్బాని కలెక్టర్, సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు.

కొనసాగుతున్న డీఎస్సీ పరీక్ష

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 23 : డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్ష ప్రశాంతంగా కొనసాగుతోంది. మంగళవారం జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్‌పల్లిలోని ఫాతిమా విద్యాలయంలో, ధర్మాపూర్ సమీపంలో గల జేపీఎన్‌సీ కళాశాలల కేంద్రంలో నిర్వహించిన పరీక్షలు సజావుగా సాగాయి. ధర్మాపూర్ జేపీఎన్‌సీఈ పరీక్ష కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 180 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 172 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 181 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 176 మంది హాజరయ్యారు.. ఫాతిమా విద్యాలయంలో నిర్వహించిన పరీక్ష కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 184 మంది హాజరు కావాల్సి ఉండగా 179 మంది హాజరయ్యారు. ఐదుగురు హాజరుకాలేదు. మధ్యాహ్నం పరీక్షకు 184 మంది గాను 176 హాజరయ్యారు.

వీరభద్ర స్వామి దేవాలయంలో నాగుపాము దర్శనం



వీరభద్రస్వామి దేవాయంలో నాగుపాము

కోయిలకొండ, జూలై 23 : మండలంలోని ఆచార్యపూర్ గ్రామంలో భద్రకాళి వీరభద్రసామి దేవాలయంలో మంగళవారం భారీ నాగుపాము కనిపించింది. వీరభద్రస్వామి గంటలు కట్టె ఎదురు కర్రకు చుట్టుకొని ఉండడాన్ని ఆలయ అర్చకులు గమనించారు. తెల్లగా భారీ పొడవుతో ఉన్న నాగుపాము కొంత సేపు బుసలు కొడుతూ తిరిగింది. గంట తరువాత మెల్లగా బయటకు వెళ్లిపోవడంతో అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. నాగుపాము వీడియోలు సోషల్ మీడియా హల్‌చల్ సృష్టించాయి.

భూత్పూర్‌లో చోరీ



వెంకటేశ్వర ట్రేడర్స్ దుకాణ సముదాయం తలుపును విరగొట్టిన దొంగలు

భూత్పూర్, జూలై 23 : మునిసిపాలటీ కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదును దోచుకెళ్లారు. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మునిసిపాలిటీలోని నాగకర్నూల్ రోడ్డు, శివాలయం ముందున్న దుకాణ సముదాయాల్లో వెంకటేశ్వర ట్రేడర్స్‌లో వెనుకభాగంలో ఉన్న తలుపులను విరగొట్టి రూ.2000 నగదును దొంగలు చోరీ చేశారు. అదే విధంగా అదే కాంప్లెక్స్‌లో టీ స్టాల్‌లో ఉన్న కౌంటర్‌లోని రూ.800 నగదును, శ్రీఆదిత్య ఫర్టిలైజర్స్ దుకాణంలో రూ.500 నగదును షట్టర్ తాళాలను విరగొట్టి తీసుకెళ్లినట్లుగా బాధితులు తెలిపారు. ఈ మేకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లుగా పేర్కొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడికి జాతీయ అవార్డు



మధుసూదన్ శర్మ

కోయిలకొండ, జూలై 23 : మండలంలోని సురారం ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న జోషి మధుసూదన్ శర్మకు జాతీయ పురస్కారాన్ని తెలుగు వెలుగు సాహిత్య వేదిక అందించారు. గురుపౌర్ణమి సందర్భంగా హైదరాబాద్‌లో తెలుగు వెలుగు సాహిత్య వేదిక వారు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాల కవులు, రచయితలు పాల్గొన్న కార్యక్రమంలో ప్రముఖ కవి, తెలుగు ఉపాధ్యాయులు అయిన మధుసూదన్ శర్మను సత్కరించి గురుభ్యోనమః ప్రశంసా పత్రంతో పాటు జాతీమ అవార్డును అందించారు.

మధుసూదన్ శర జాతీయ అవార్డు పొందడంపై తెలంగాణ రచయితల సంఘం, సూరారం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

జూరాలకు కొనసాగుతున్న వరద

- ● 36 గేట్లు ఎత్తివేత
- ● ఐదు యూనిట్లలో కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి



దిగువకు శ్రీశైలం వైపు ప్రవహిస్తున్న కృష్ణమ్మ

ధరూరు, జూలై 23 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో ఎగువ ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి భారీగా వరద నీరువచ్చి చేరుతోంది. నదీ పరీవాహక ప్రాంత ప్రజలకు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. పర్యాటకులను సైతం నీటి ఉధృతి వద్దకు వెళ్లరాదని పోలీసులు తెలిపారు.

ప్రస్తుతం జూరాల జలాశయంలో 317.560 మీటర్లలో నీటి నిల్వ ఉండగా, ప్రాజెక్టులో 7.798 టీఎం సీలకు నీటి నిల్వ చేరుకుంది. ప్రాజెక్టులో 1,65,000 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లోగా నమోదు కాగా, 36 గేట్లను ఒక మీటరు మేర ఎత్తి వేసి 1,40,000లు క్యూసె క్కుల నీటిని దిగువన శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నారు. అలాగే జెన్‌కో జల విద్యుత్ కేంద్రానికి 29,433 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఐదు యూనిట్ల ద్వారా 140 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు. దీంతో నెట్టెంపాడు లిఫ్ట్‌కు 1500 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-1కు 1300, ఎడమ కాల్వకు 640, కుడి కాలువకు 608 మొత్తం ప్రాజెక్టు నుంచి 1,56,061 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జూరాల అధికారులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

కొనసాగుతున్న జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఆశాజనకంగా ఉత్పత్తి కొనసాగుతోందని జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి ఒక లక్షా 50వేల క్యూసెక్కుల నీరు విడుదలవుతుండడంతో ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 11 యూనిట్లు ప్రారంభించి విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నామని వివరించారు. పదిరోజుల క్రితం ప్రారంభమైన ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు ఎగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 16.415 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి, దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 20.328 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి కొనసాగిస్తున్నామని ఆయన తెలిపారు. వరద ఇలాగే కొనసాగితే రికార్డు స్థాయిలో ఉత్పత్తి కొనసాగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులు ఫుల్ - టీచర్లు నిల్

- ఉన్న నలుగురు ఉపాధ్యాయుల బదిలీ
- విద్యార్థుల భవిష్యత్‌ను ఆగం చేస్తున్న అధికారులు
-- రెండు వారాలుగా విద్యార్థులే ఉపాధ్యాయులు



వటవర్లపల్లిలో పాఠాలు చెపుతున్న విద్యార్థులు

దోమలపెంట, జూలై 23: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటుంటే మరోపక్క అధికారుల నిర్లక్ష్యంలో విద్యావ్యవస్థను నీరుగార్చేటట్లుందని తల్లిదండ్రులు ఆవేదన వక్యం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వటవర్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ ఏడాది ఒకటి నుంచి ఏడు తరగతుల వరకు 73మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ నలుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించేవారు. ఇటీవల ఉపాధ్యాయ బదిలీల్లో నలుగురూ ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లగా, వటవర్లపల్లికి లింగాల మండలం కోమటికుంట నుంచి అంజిలాల్ ప్రధానోపాధ్యాయునిగా విధుల్లో చేరి రెండు రోజులు తిరిగి కుండానే డిప్యూటేషన్‌పై యథాస్థానానికి వెళ్లిపోవడం గమనార్హం. పర్యవసానంగా వటవర్లపల్లి విద్యార్థుల చదువులు అటకెక్కాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులు ఫుల్‌గా ఉన్నా టీచర్ల సంఖ్య నిల్‌గా ఉందని, ఈ సమస్యను జిల్లా విద్యా శాఖ అధికారులకు తెలియపరిచినా పట్టించుకోవడం లేదని మాజీ ఎస్ఎంసీ చైర్మన్ గంధం సూర్యం, మాజీ వార్డు సభ్యులు శ్రీనువాస్, శశికళ, గ్రామస్థులు ప్రభాకర్, రాజేష్, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. కాగా, ఈ విషయమై అమ్రాబాద్ ఎంఈవోను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులో లేరు.

నూతన పద్ధతులు అవలంభిస్తేనే దిగుబడులు

- పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మల్లారెడ్డి



ఇంద్రకల్ గ్రామంలో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మల్లారెడ్డి

తాడూరు, జూలై 23 : ప్రస్తుత వాతావరణ పరిస్థితులకనుగుణంగా వ్యవసాయంలో నూతన పద్ధతులను అవలంభించినట్లయితే ఎక్కువ దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఇంద్రకల్ గ్రామంలో పాలెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడూరు మండలంలోని ఇంద్రకల్ గ్రామాన్ని వచ్చే మూడు సంవత్సరాల పాటు పాలెం కృషి విజ్ఞాన కేంద్రం దత్తత తీసుకుని రైతులకు వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవసాయం చేసే నూతన పద్ధతులపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు గ్రామంలో ఉంటూ వ్యవసాయ పద్ధతులను పరిశీలిస్తూ రైతులతో మమేకమవుతూ వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి గ్రామంలో మూడు సంవత్సరాల పాటు ప్రతీ నెల రెండుసార్లు శాస్త్రవేత్తల బృందం గ్రామాన్ని సందర్శించి వ్యవసాయంలో రైతులకు కొత్త విధానాలపై అవగాహన కల్పిస్తూ సాంకేతిక సలహాలు, పంటల్లో ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణతో పాటు భూసారం, నీటి పరిరక్షణకు సంబంధించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న పత్తి పంటలో ఎరువులు వాడే విధానంపై వాటి పోషకాలపై పూర్తిస్థాయిలో అర్థమయ్యే విధంగా క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు చెప్పారు. మొత్తంగా ప్రతీ రైతు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు పంటలు సాగు చేసినట్లయితే తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చన్నారు. పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త భరత్‌భూషణ్, డాక్టర్ శంకర్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సైదయ్య, డాక్టర్ విజయలక్ష్మీ, శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ శాఖ ఏడీఏ రమేష్‌బాబు, తాడూరు ఏవో సాయిరమేష్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

తెలంగాణకు మొండిచేయి చూపిన కేంద్ర బడ్జెట్

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు - నాగర్‌కర్నూల్‌లో నిరసన

కందనూలు, జూలై 23 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు విమర్శించారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వర్ధం పర్వతాలు మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ ప్రస్తావనే లేదని, అదేవిధంగా రాష్ట్ర విభజనలో తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను కూడా ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడంలో ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్‌లో తీరని అన్యాయం జరుగుతున్నదని, తెలంగాణ రాష్ట్రం నుంచి ఉన్న ఏడుగురు ఎంపీలు చూస్తున్నారు తప్ప ఏమి చేయలేని స్థితిలో ఉన్నారని ఈ బడ్జెట్‌లో పూర్తిగా తెలంగాణ రాష్ట్రానికి వ్యతిరేకమైందని విమర్శించారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లాకు రైల్వేలైన్‌లో కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్, జిల్లా నాయకులు గుంపల్లి అశోక్, పొదిల రామయ్య, అంతటి కాశన్న, శ్రీనివాస్, లింగం, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తా



17వ వార్డులో నెలకొన్న సమస్యలను మునిసిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్‌కు వివరిస్తున్న 17వ వార్డు కౌన్సిలర్ షేక్ ఏజాస్

కల్వకుర్తిటౌన్, జూలై 23 : వార్డు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని 17వ వార్డు కౌన్సిలర్ షేక్ ఏజాస్ అన్నారు. మంగళవారం ఆయన మునిసిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్‌తో కలిసి వార్డులో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు, కాలనీలో కుక్కలు, కోతుల బెడద ఎక్కువైనట్లు వారు తెలిపారు. ఇటీవల కురుస్తున్న ముసురు వర్షాలతో ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు పెరిగి ఇబ్బంది కలిగిస్తున్నాయని, ప్రమాదకంగా ఉన్న మట్టి మిద్దెలను కూల్చివేయాలని కౌన్సిలర్ సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్‌మసూద్, చోటు, షారుక్, సలీం, ముబీన్, కాలనీవాసులు తదితరులు పాల్గన్నారు.

వనమహోత్సవంలో విరివిగా మొక్కలు నాటాలి

చారకొండ, జూలై 23: వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ అన్నారు. మండల కేంద్రంలో గ్రామపంచాయతీ స్థలంలో మంగళవారం ఉపాధిహామీ కూలీలు 500 మొక్కలు నాటారు. అదేవిధంగా ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ మొక్కలు నాటి వాటికి నీళ్ల పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటిని సంరక్షించడం అంతే ముఖ్యమని అన్నారు. వనమహోత్సవ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలని అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో మండలంలో మొత్తం 85 వేల మొక్కలు నాటేందుకు లక్ష్యం పెట్టుకున్నట్లు, ఇప్పటి వరకు 83 వేల మొక్కలు నాటినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి గణేష్ ఉన్నారు.

తైక్వాండో విజేతకు ఘన సన్మానం

కొల్లాపూర్, జూలై 23 : రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబర్చి బ్రాంజ్ మెడల్ సాధించిన విద్యార్థి తేజనీష్‌యాదవ్‌ను పాఠశాల యాజమాన్యం మంగళవారం ఘనంగా సన్మానించింది. కొల్లాపూర్ మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన మిద్దె మహేష్, మిద్దె శ్యామలా దంపతుల కుమారుడు తేజనీష్‌యాదవ్ ఇటీవలే మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఆర్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో అండర్-18కేజీల విభాగంలో ప్రతిభ కనబర్చి తేజనీష్‌యాదవ్ బ్రాంజ్ మెడల్ సాధించాడు. మంగళవారం కొల్లాపూర్ పట్టణంలోని గ్రీన్‌లాండ్ పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్‌యాదవ్ తైక్వాండో మాస్టర్ శరబంద, కోచ్ భాస్కర్‌యాదవ్‌లు విద్యార్థిని శాలువాతో సన్మానించి మెమొంటో అందజేశారు.

తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్‌కు స్థల సేకరణ

ఉప్పునుంతల, జూలై 22: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించబోయే తెలంగాణ ఇంటర్‌నేషనల్ స్కూల్ ఉప్పునుంతల మండలానికి కేటాయిచారు. ఇట్టి స్థల పరిశీలనను మంగళవారం తహసీల్దార్ శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు కట్ట అనంతరెడ్డి, నరసింహరెడ్డి, నరసింహరావులతో కలిసి మండల పరిధిలోని రాయిచేడ్ గ్రామంలోని సర్వేనెంబరు 61లో సుమారుగా 24ఎకరాల భూమిని సర్వేయర్ సత్యనారాయణ గుర్తించి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు.

ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలి

- డీఎఫ్‌సీఎస్ జిల్లా డైరెక్టర్ గొడుగు బాలచందర్



తహసీల్దార్ ఇబ్రహీంకు వినతి పత్రం అందజేస్తున్న ముదిరాజ్ మహాసభ నాయకులు

కల్వకుర్తి, జూలై 23 : ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని డీఎఫ్‌సీఎస్ జిల్లా డైరెక్టర్ గొడుగు బాలచందర్ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు జమ్ముల శ్రీకాంత్‌లు డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఇబ్రహీంకు తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలచందర్, జమ్ముల శ్రీకాంత్‌లు మాట్లాడుతూ తెలంగాణలో అత్యంత ప్రాచీన, అధిక జనాభా గల కులమైన ముదిరాజ్, తెనుగోళ్లు, ముత్తరాసిలు వెనకబాటుకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక శాతం మంది మత్స్య వృత్తి, తోటల పెంపకం, ఇతర వృత్తులపైన కూడా జీవనం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం ముదిరాజ్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేస్తూ ప్రకటించినందున ధన్యవాదాలు తెలిపారు. ముదిరాజ్ మహాసభ కొల్లూరి శ్రీధర్, యంగంపల్లి ఎఫ్‌సీఎస్ అధ్యక్షుడు రామస్వామి, ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శి పుట్ట వెంకటయ్య, జిల్లా ఎఫ్‌సీఎస్ అధ్యక్షుడు తాడెం జంగయ్య, మార్చాల ఎఫ్‌సీఎస్ అధ్యక్షుడు శ్రీకాంత్, బండారు శ్రీనివాసులు, చింతమౌని యాదయ్య, ఉపాధ్యక్షుడు కొండ్ల ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు సురేష్, పుట్ట రాజశేఖర్, మందుల యాదయ్య గొడుగు తిరుపతయ్య, భీమని సురేష్ పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు



విద్యార్థినులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఎ.సురేందర్‌రెడ్డి, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం నిర్మల, నాయకులు

కల్వకుర్తి, జూలై 23 : పట్టుదలతో శ్రమిస్తే పేదరికం అడ్డుకాదని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఎంతో మంది పేద విద్యార్థినులు నిరూపించారని కల్వకుర్తి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సురేందర్‌రెడ్డి తెలిపారు. కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పేదింటి ఆడబిడ్డలు ఆదిలక్ష్మీ, అమూల్య, దీప్తిలు ప్రతిభ చాటి స్టేట్ ర్యాంకులు సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 1982-84 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.25వేలు సమకూర్చారు. మంగళవారం కళాశాలలో జరిగిన సమావేశంలో ఆ విద్యార్థినులకు జడ్పీహెచ్ఎస్ బాలికల హెచ్ఎం నిర్మల, నాయకుడు లక్ష్మారెడ్డి, ఎంప్లాయీస్ వాయిస్ పత్రికా ఎడిటర్ కే.వెంకటేశ్వర్లతో కలిసి ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి అందజేశారు. రిటైర్డు ప్రిన్సిపాల్ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ వేణు, అధ్యాపకులు సదానందంగౌడ్, శోభ, రాజేష్, రమాకాంత్, మహబూబ్ ఆలీ, మల్లేష్, గిరిబాబు, పరుశరాం, శ్రీనివాస్, లక్ష్మయ్య, సంతోష్‌గౌడ్, సిబ్బంది బాలయ్య తదితరులు ఉన్నారు.

దిష్టిబొమ్మలా బస్టాండ్

- ఇబ్బందులో ప్రయాణికులు

- కరువైన మూత్రశాలలు, మరుగుదొడ్లు

- పట్టించుకోని అధికారులు, పాలకులు



తిమ్మాజిపేటలో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్

భయంతో వణికిపోతున్నాం



బస్సు రోడ్డుపై ఎక్కడ ఆగుతుందో తెలియక పరుగులు పెడుతున్నాం. బస్సు ఎక్కే సమయంలో ఏమి జరుగుతుందోనని ప్రాణభయంతో వణికిపోతున్నా. నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను వినియోగంలోకి తెచ్చి మాకు రక్షణ కల్పించాలని కోరుతున్నాం.

- అఖిల, 9వ తరగతి

తిమ్మాజిపేట, జూలై 23 : తిమ్మాజిపేట మండల కేంద్రంలో 2001లో రూ. లక్షలు వెచ్చించి నిర్మించి ప్రారంభించిన ఆర్టీసీ బస్టాండ్ ప్రస్తుతం ఉపయోగంలో లేక దిష్టిబొమ్మలా మారడంతో ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతి నిత్యం మండల కేంద్రానికి వేలాదిమంది వివిధ పనుల నిమిత్తమై వస్తుంటారు. ప్రజలు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, మహిళల అవస్థలు వర్ణనాతీతం. తిమ్మాజిపేటకు వచ్చిపోయే వారికి బస్టాండ్ లేకపోవడంతో రోడ్డుపైన నిలబడి గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. ప్రయాణీకులకు నిల్వ నీడ లేదు. తాగునీటి వసతి ఉండదు. వృద్ధులకు, మహిళలకు మూత్రశాలలు, మరుగుదొడ్లు కరువై వారు పడుతున్న బాధలు అధికం. ఎండ తగిలితే వర్షం చినుకులు రాలితే వ్యాపార సంస్థల హోటల్ ముందుకు పరిగెడుతూ నిలబడుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి ప్రయాణీకుల సౌకర్యార్థమై నిర్మించుకున్న బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని పలు పర్యాయాలు ప్రజలు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పాలకులు మారుతున్నా ప్రభుత్వాలు మారుతున్నా ప్రయాణీకుల బాధలు తీరడం లేదని పలువురు అంటున్నారు. నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లో కిటికీలు ధ్వంసమయ్యాయి. మూత్రశాలలు శిథిలావస్థలో ఉండటంతో కొన్నాళ్ల పందులు ఏళ్ల తరబడి స్థావరం చేసుకున్నాయి. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి నెలకొంది. బస్టాండ్ స్థలాన్ని కబ్జాదారుల ఆక్రమణకు గురవుతుందని సమాచారం తెలుసుకున్న ఆర్టీసీ అధికారులు ఇటీవల ప్రహరీ నిర్మించడంతో ప్రయాణికుల ఆశల చిగురింపజేశారు. అయినా నిరాశే మిగిలింది. ఇకనైనా ఎంపీ, ఎమ్మెల్యే, ఆర్టీసీ అధికారులు చొరవ చూపాలని, బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని, బస్టాండ్ ఆవరణలో మంచినీటి వసతి కల్పించి మూత్రశాలలు, మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కన ఆగిన బస్సును ఎక్కడానికి ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు

నల్లమల అభివృద్ధికి సహకరించాలని మంత్రులకు వినతి



మంత్రులకు వినతి పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట, జూలై 23: నల్లమల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరుతూ మంగళవారం సంచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, పంచాయత్‌రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కలిసి వినతి పత్రాలు అందజేశారు.

డీఏలను వెంటనే విడుదల చేయాలి

అచ్చంపేట, జూలై 23: రెండున్నర ఏళ్లుగా డీఏలను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్ రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలతో పాటు మండల పరిధిలోని పల్లపట్లలోని ప్రాథమిక పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండున్నర ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను సంవత్సరమైనా రాని పీఆర్‌సీ విద్యారంగానికి నిధుల పెంపు, ఉపాధ్యాయులు దాచుకున్న జీపీఎఫ్ బకాయిలు రకరకాల కారణాలతో ఆగిపోయాయని, అట్టి బిల్లులను ఈ బడ్జెట్‌లో చర్చించి తగినన్ని నిధులు కేటాయించి పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయులు నందకిషోర్, నారాయణ గౌడ్. సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ ఆదర్శ పాఠశాలకు అనువైన స్థలాన్ని సేకరించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

- సంత బజార్‌లోని ప్రాథమిక పాఠశాల ఆకస్మిక తనిఖీ

- ఇంటిగ్రేటెడ్ ఆదర్శ పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన

బిజినేపల్లి, జూలై 23 : ఇంటిగ్రేటెడ్ ఆదర్శ పాఠశాల నిర్మాణానికి అనువైన స్థలాన్ని సేకరించాలని సంబంధిత శాఖ అధికారులకు కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. మండల కేంద్రంలోని సంత బజారులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన ఆహారం, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఐదవ తరగతి విద్యార్థులను గణితంలో తీసివేతలు, భాగహారం సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేశారో లేదోనని అడిగి తెలుసుకున్నారు. పాఠ్య బోధనలో ఏమైనా సందేహాలు వస్తే తరగతి గదిలోని ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకొని విషయ అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల గదులన్నీ పరిశీలించి ఆయన వంట గదిలోకి వర్షపు నీరు రావడాన్ని గమనించిన ఆయన వెంటనే ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలు చేసి నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని మంగనూర్ గ్రామ శివారులోని సర్వే నంబరు 801లోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ ఆదర్శ పాఠశాల నిర్మాణానికి 20 ఎకరాలు అవసరమవుతందని కలెక్టర్ అన్నారు. పాఠశాల నిర్మాణం, సువిశాలమైన క్రీడా ప్రాంగణం, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వసతి గృహాలు, ల్యాబ్స్ వంటి అన్ని రకాల వసతులతో పాఠశాల నిర్మాణం నాగర్‌కర్నూల్ నియోజక వర్గ పరిధిలో భాగంగా చేపట్టనున్నట్లు తెలిపారు. అవసరమైన ప్రభుత్వ భూమిని చూడాలని తహసీల్దార్ జనుంపల్లి శ్రీరాములుకు ఆదేశించారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి రమాదేవి, ఎంపీడీవో కతాలప్ప, పీఆర్ఈఈ ఉన్నారు.



బిజినేపల్లిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● తిమ్మాజిపేట: ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. తిమ్మాజిపేట మండలంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. ప్రజాపాలనకు సంబంధించిన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పరిశీలించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500రూపాయలకే గ్యాస్ సిలిండర్ పొందేందుకు దరఖాస్తులు వివరాలను ఎంపీడీవో లక్ష్మీదేవిని అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు చేస్తూ ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పులు దొర్లిన అర్హులైన లబ్ధిదారులను ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రభుత్వ పథకాలను అందేలా సహకరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులతోను పలు విషయాలపై సమస్యలను అడిగారు. అనంతరం రైతు వేదికలో కొనసాగుతున్న రుణమాఫీ సమస్యల పరిష్కారం కేంద్రాన్ని సందర్శించి అక్కడికి చేరుకున్న రైతులతో రుణమాఫీకి సంబంధించిన విషయాలను అడిగారు. లక్షలోపు రైతులకు రుణమాఫీ జరిగిందని, ఇంకా ఎందరికి జరగాల్సి ఉందని రుణమాఫీ జరగని రైతులతో మాట్లాడి సమస్య పరిష్కరించి రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాలలో వేయించాలని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్‌కు సూచించారు. ఎవరైనా రైతులు మరణిస్తే రైతు కుటుంబ సభ్యులకు తక్షణమే బీమా డబ్బులు అందేలా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా యూనియన్ బ్యాంక్‌లో జరుగుతున్న రుణమాఫీ ప్రక్రియను పరిశీలించారు. రైతుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బ్యాంకు సిబ్బంది చూడాలని ఆదేశించారు.

రుణమాఫీ జరిగిన రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు 200మంది ఖాతాదారులకు రుణమాఫీ సమస్యలు పరిష్కరిస్తున్నామని బ్యాంక్ మేనేజర్ కలెక్టర్‌కు తెలియజేశారు. తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ధరణి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ జేకే.మోహన్‌ను ఆదేశించారు. ఆయన వెంట సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

మట్టిమిద్దెలో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి

తెలకపల్లి, జూలై 23 : మట్టి మిద్దెలలో ఉన్న కుటుంబ సభ్యులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తెలకపల్లి ఎస్ఐ నరేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో విపరీతంగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా తెలకపల్లి మండల పరిధిలోని గౌరారం గ్రామాన్ని మంగళవారం ఎస్ఐ నరేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి మిద్దెలలో నివాసం ఉండే ప్రజలు వర్షాలు తగ్గేంత వరకు సురక్షిత ప్రాంతానికి లేదా ఇతర సురక్షిత ఇళ్లకు వెళ్లి అక్కడ ఉండాల్సిందిగా ప్రజలకు సూచించారు.

● ఊర్కొండ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వీరబాబు అన్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని ముచ్చర్లపల్లి గ్రామాన్ని సందర్శించి తగు సూచనలు చేశారు. విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నందున స్తంభాలు, తీగల దగ్గరికి వెళ్లొద్దని అన్నారు. అదేవిధంగా 24 గంటల పాటు పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటారని ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలిగినా, ఆకస్మికంగా ప్రమాదాలు చోటుచేసుకున్నా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

● ఉప్పునుంతల: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై లెనిన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు.

● వంగూరు: ముసురు వర్షాల నేపథ్యంలో మంగళవారం వంగూరులో ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ మహేందర్ ప్రమాద నివాసగృహాలను పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్నటువంటి నివాస గృహాలను గుర్తించి వారికి తగిన సూచనలు చే శారు. మట్టిమిద్దె కలిగిన ఇళ్లల్లో నివసించే ప్రజలు అ ప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సమయంలో 100కు కాల్ చేయాలని కోరారు.

● తాడూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఏ గ్రామంలోనైనా శిథిలావస్థకు చేరి పురాతన భవనంలో విద్యాబోధనలు కొనసాగిస్తున్న ఉపాధ్యాయులందరూ విద్యార్థులను వేరే గదుల్లోకి మార్చి తరగతి గదులను కొనసాగించాల్సిందిగా ఎస్ఐ మహేష్ సూచించారు. మంగళవారం మండలంలోని యంగంపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన పాఠశాలల్లో విద్యార్థులు ఉండడం మూలంగా ప్రస్తుతం కురుస్తున్న నిరంతర వర్షంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అందువల్ల మంచి గదుల్లోకి విద్యార్థులను తరలించి విద్యాబోధన కొనసాగించాలని కోరారు. ఈ విషయాన్ని మండల విద్యాధికారి భాస్కర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు.



మట్టిమిద్దెలో నివసిస్తున్న కుటుంబాలకు సూచనలు చేస్తున్న ఎస్ఐ నరేష్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పాడుబడిన ఇళ్ల తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో కృష్ణయ్య

తెలకపల్లి, జూలై 23 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో కృష్ణయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గౌరెడ్డిపల్లిలో పారిశుధ్య, పరిసరాల పరిశుభ్రత, పాడుబడిన ఇళ్ల తొలగింపు పనులను పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాల నిర్వహణ విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలు కొన్ని సూచించగా తక్షణమే డబ్బుతో ముడిపడని కొన్ని పనులను పారిశుధ్య కార్మికులతో చేయించారు. విద్యుత్ వైర్లపై వాలని కొమ్మలు లైన్‌మెన్ సమక్షంలో తొలగించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ట్యాంక్‌బండ్ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు.

పోయిన ఫోన్‌ను అందించిన పోలీసులు

ఉప్పునుంతల, జూలై 23: గత నెలలో మండల పరిధిలోని పెనిమిళ్ల గ్రామానికి చెందిన వెంకటేష్ గౌడ్‌ను తన ఫోన్‌ను పోగొట్టుకొని ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పోలీసులు సెల్‌ఫోన్‌ను దొరకపుచ్చుకొని మంగళవారం ఎస్సై లెనిన్ బాధితుడు వెంకటేష్ గౌడ్‌కు పోలీస్ స్టేషన్‌లో అందజేశారు.

కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయాలి

ఊర్కొండ, జూలై 23: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలో భాగమైన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ నాయకులు మంగళవారం తహసీల్దార్ చెన్నకిష్టన్నకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్, ఆరు గ్యారెంటీలు, రైతు భరోసా, పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రధానమంత్రి ఫసల్ బీమాను రైతులకు వర్తించేలా చేయాలని వారు వినతిపత్రంలో కోరారు. బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు అంజనేయులు, నాయకులు బ్రహ్మచారి, శివ, గణేష్, శ్రీకాంత్, లక్ష్మణ్, జంగయ్య, ముత్యాలు తదితరులు ఉన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అమ్రాబాద్‌లో జానపద కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్న దృశ్యం

అమ్రాబాద్, జూలై 23: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోరాదని కోరుతూ జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో అమ్రాబాద్ మండల కేంద్రంలో మంగళవారం సాంస్కృతిక కళా ప్రదర్శనలను నిర్వహించారు. ఇదే సందర్భంలో పరిసరాల పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ ఆట పాటలతో జానపద కళారూపాల ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. జానపద కళాకారులు భాస్కర్, కృష్ణ, శివనాగులు, నరేందర్, శివయ్య, సికిందర్, పార్వతమ్మ, అన్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

గోప్లాపూర్‌లో సౌకర్యాలు కల్పించండి

పెంట్లవెల్లి, జూలై 23 : మండల పరిధిలోని గోప్లాపూర్ గ్రామంలో సీపీఎం బృందం ఆయా కాలనీల్లో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో కరెంటు ఉండడం లేదని, అదేవిధంగా నీరు కలుషితమై వస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా మంచినీటి ట్యాంకులను కడగడం లేదని, బ్లీచింగ్ పౌడర్ కూడా కాలనీల్లో వేయడం లేదని పేర్కొన్నారు. గ్రామంలో చాలా వరకు సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి స్వర్ణలతకు సీపీఎం బృందం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఈశ్వర్, మండల నాయకులు హనుమంతు, శ్రీనివాసులు, సుధాకర్, లక్ష్మయ్య, మంగమ్మ, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

పెంట్లవెల్లి, జూలై 23 : సారా స్థావరాలపై పోలీసులు దాడి చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల పరిధిలోని జటప్రోల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ ఎస్ఐ హనుమంతు తెలిపిన కథనం ప్రకారం... పెంట్లవెల్లి మండలం జటప్రోల్ గ్రామంలో సారా అమ్ముతున్నారనే పక్కా సమాచారంతో రెండు స్థావరాలపై దాడులు చేశామని తెలిపారు. ఆరు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ఇద్దరిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట సంవత్సరం కాలానికి బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. మంజుల, వెంకటేశ్, శ్రీశైలం పాల్గొన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

కొల్లాపూర్, జూలై 23 : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించారని తెలంగాణలో ప్రవేశపెట్టబోయే విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాసు, బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు బి.శేఖర్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్ఐడీ పాఠశాలను సందర్శించిన విద్యార్థి సంఘం నాయకులు ఆర్ఐడీ పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం, మెస్‌చార్జీలు పెంచాలని ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని, శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించి నూతన భవనాలను నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణకై ఎంఈవో, డీఈవో పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి

వంగూరు, జూలై 23: మండలంలోని రంగాపూర్ దేవుని తండాలో ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాల భూమిని వెంటనే పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చింత ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రంగాపూర్ దేవుని తండాను సీపీఎం నాయకులు సందర్శించి ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ 1993లో ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు గాను రెండు ఎకరాల భూమిని కేటాయించిందని, ఇట్టి భూమిని నేటికీ కూడా పేదలకు పంపిణీ చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. వెంటనే పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. బాలస్వామి, లక్ష్మణ్‌నాయక్, సురేందర్ పాల్గొన్నారు.

మురుగు కాల్వలను పరిశీలించిన సీపీఎం నాయకులు

తెలకపల్లి, జూలై 23 : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న మురుగు కాల్వలను సీపీఎం నాయకులు ఆర్.శ్రీనివాసులు, గోపాస్‌లక్ష్మణ్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల మధ్యలో మురుగు కాల్వలు ఉండడం వలన ఈగలు, దోమలు ఉండే అవకాశం ఎక్కువగా ఉందని, ఇలాంటి మురుగు కాల్వలను సంబంధిత అధికారులు వెంటనే శుభ్రం చేయాలని, లేకపోతే అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వారన్నారు. అధికారులలో ఇంత నిర్లక్ష్యం ఏంటని వారు ప్రశ్నించారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆర్.శ్రీనివాసులు, గోపాస్‌లక్ష్మణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ లింకు రోడ్లను పునరుద్ధరించాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని చెర్లటిక్యాల, తుమ్మలసూగురు, ఐతోల్, సిర్సవాడ, భలాన్‌పల్లి, యత్మతాపూర్ తదితర గ్రామాల్లో ఉన్న లింకు రోడ్లను తక్షణమే బీటీ రోడ్డుగా మార్చాలని జిల్లా సీపీఎం కార్యవర్గ సభ్యుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చెర్లటిక్యాల గ్రామం వద్ద ప్రజలు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న కుమ్మెర, చెర్లటిక్యాల గ్రామ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు ఆంజనేయులు, కృష్ణయ్య, రామస్వామి, లక్ష్మయ్యతో పాటు మరికొంత మంది రైతులు పాల్గొన్నారు.

రుణాలు మళ్లీ ఇవ్వాలి

తాడూరు, జూలై 23 : ప్రభుత్వం రుణమాఫీ చేసిన డబ్బులను బ్యాంక్ అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా మళ్లీ వెంటనే రుణమాఫీని అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. దీనికి సంబంధించి మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ ప్రమీలకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీలను రెన్యువల్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా ప్రభుత్వం ఇచ్చిన సొమ్మును బ్యాంక్ అధికారులకు రైతులకు అందించాలంటూ కోరారు. ఆంజనేయులు, కృష్ణయ్య యాదయ్య, కృష్ణారెడ్డి, జక్కయ్య, సుధాకర్‌గౌడ్, నాగరాజు, నరసింహ, ఈశన్న తదితరులు ఉన్నారు.

ఉన్నత చదువుల్లో రాణించాలి

కల్వకుర్తిటౌన్, జూలై 23: ఉన్నత చదువుల్లో రాణించాలని విశ్రాంత హెచ్ఎం రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని మార్చాల గ్రామంలో గత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో 10జీపీఏను సాధించిన నామని తేజస్వీని ఆయన అభినందించి మాట్లాడారు. ఇందుకు సహకరించిన తండ్రి రాజేందర్‌ను అభినందించి, విద్యార్థినికి రూ.10వేలు నగదుప్రోత్సాహాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం - పోలీసులకు ఫిర్యాదు

తిమ్మాజిపేట, జూలై 23 : మండల పరిధిలోని ఎదిరేపల్లి గ్రామానికి చెందిన ఓ బాలిక అదృశ్యం అయినట్లు బాలిక తల్లిదండ్రులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఎదిరేపల్లి గ్రామానికి చెందిన ముద్దం చెన్నయ్య కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ నెల 19న పిల్లలను ఇద్దరిని ఇంటి దగ్గర ఉండమని చెప్పి వ్యవసాయ పొలానికి వెళ్లిపోయారు. కుమారుడు కాలేజీకి వెళ్లిపోగా కూతురు ఇంటి వద్దనే ఉంది. వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చి చూడగా కూతురు కన్పించకపోవడంతో గ్రామాల్లోని బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ కన్పించలేదు. అదే గ్రామానికి చెందిన అరవింద్ అనే వ్యక్తిపై అనుమానం ఉందని గతంలో కూడా తమ కూతురును వేధిస్తే పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా పెట్టామని, అతడే తమ కూతుర్ని కిడ్నాప్ చేసి ఉంటాడని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.